# ఎండ

ఎండ వెన్నెల్లా వుంది.

ఎండ వెన్నెల్లా వుంటుందా ఎవరికైనా?

ఎవరికైనా ఏమో గానీ, యంపీరావుకి మాత్రం ఆ వేళ ఎండ వెన్నెల్లాగే వుంది. యంపీరావ్ యంపీ కాదు. కనీసం ఎమ్మెల్యే అన్నా కాదు. అయినా అతనికి ఎండ వెన్నెల్లాగే వుంది. యంపీలకీ, ఎమ్మెల్యేలకీ ఎండ వెన్నెల్లా వుంటుందా?

చలవ చేసిన ఖద్దరు తొడుక్కుని చలవ కళ్ళద్దాలు పెట్టుకునే చాలామందికి ఎండ కనపడదు. వాళ్ళకి వానలూ కనపడవు; వరదలూ కనపడవు. కరువులూ కనపడవు; కాటకాలు కనపడవు. ఓట్లకి తిరిగిన నాల్రోజులూ తప్పితే; ఆ తర్వాత ప్రజలూ కనపడరు – మంత్రులూ, ముఖ్యమంత్రులూ, అతిప్రధానమంత్రులూ, అత్యంత ప్రధానమంత్రులూ, గవర్నర్లూ, అధికారులూ, లక్షాధికారులూ, కోటీశ్వరులూ తప్ప.

అంటే వాళ్ళంతా ప్రజలు కారా?

కారు. ముమ్మాటికీ కారు! సామాన్యప్రజలు మట్టుకు అసలే కారు.

అంచేత – చాలామంది కనబడని, ఈ లోకంలో జరుగుతున్నవి చాలా చాలా కనబడని, చాలామంది ప్రజాప్రతినిధులకి – అనగా ఎంపీలకీ, ఎమ్మెల్యేలకీ ఎండ ఎండలా కనబడకుండా వెన్నెల్లా కనబడితే అనిపిస్తే అందులో ఆశ్చర్యం లేదు. కాని ఎంపీ గాని, ఎమ్మెల్యే గాని ఎంతమాత్రమూ కాని ఎంపీరావుకి ఎండ వెన్నెల్లా అనిపించడమూ కనిపించడమే కించిత్తు ఆశ్చర్యం కలిగించే విషయం.

'ఎమ్' రావు ఇంటిపేరు. 'పి' అతని అసలు పేరు. అతని ఇంటిపేరూ, అసలు పేరూ, అసలేమిటో మనకి తెలీదు గానీ, అతని వ్యావహారికనామం మాత్రం యంపీరావ్!

యంపీరావ్ అండ్ సన్స్ పేర యంపీరావ్‌కు ఆ సిటీలో పెద్ద బట్టల దుకాణమూ, చాలా పెద్ద మందుల షాపూ, మరీ పెద్ద జనరల్ స్టోర్సూ వున్నాయి. ఆ మూడు

సంస్థల్లోనూ వ్యాపారం మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగుతున్న సంగతి అందరికీ తెలుసు. కాని, ఆ వ్యాపారంలో గత ఆరు మాసాల్లోనే అరవై వేలు నికరమైన లాభం వచ్చిన సంగతి ఆ రోజే యంపీరావ్‌కి తెలిసింది.

బట్టల దుకాణానికీ, జనరల్ స్టోర్స్‌కీ మధ్యగా వున్న మందుల షాపులో అందంగా, మెత్తగా, హాయిగా సోఫాలా వున్న కుర్చీలో కూర్చుని, అప్పుడే ఫ్రిజ్‌లోంచి తీసిన పైనాపిల్ జ్యూస్‌లో ఆదనంగా అయిసు ముక్కలు వేసుకుని ఆరారగా తాగుతూ, బంగారపు ఫ్రేమ్ కళ్ళద్దాల్లోంచి బయటికి చూస్తున్న యంపీరావ్‌కి ఆ వేళ అమితానందంగా వుంది.

అందుకే అతనికా ఎండ వెన్నెల్లా వుంది.

ఎండ వెన్నెల్లా అనిపించడానికి ఎంపీలూ కానక్కర్లేదు, ఎమ్మెల్యేలూ కానక్కర్లేదు, ఎంపీరావులు కూడా కానక్కర్లేదు. అందుకే శ్రీనివాసమూర్తి క్కూడా ఆ వేళ ఎండ వెన్నెల్లాగే అనిపించింది.

శ్రీనివాసమూర్తికి మూడు వేల రూపాయల జీతం గల ఉద్యోగం వుంది. జీతం మూడు వేలుకాక అదనంగా ఆరువేలయినా సంపాదిస్తాడనీ, శ్రీనివాసమూర్తి మూర్తీభవించిన లంచగొండితనం అనీ కొందరంటారు గాని, చాలామంది ఆ సంగతి ఒప్పుకోరు. శ్రీనివాసమూర్తి అసలొప్పుకోడు. భార్యకి అతను ఆదర్శప్రాయుడు, పూజనీయుడూ అయిన భర్త. పిల్లలకి ప్రేమస్వరూపుడైన తండ్రి. ప్రభుత్వానికి విశ్వాసపాత్రుడూ మరియు సమర్థుడూ అయిన అధికారి.

అధికారగర్వం అతనిలో మచ్చుకైనా కనబడదు. అహంభావం అతనిలో అరవీసమైనా లేదు. ఆ సంగతి మాత్రం అందరూ ఒప్పుకుంటారు. అంతకిముందే అతన్ని కలుసుకున్న ఏ క్లాస్ కంట్రాక్టర్ కామేశ్వర్రావ్ కూడా, శ్రీనివాసమూర్తిలో గల ఇలాంటి సద్గుణాలన్నిటినీ సవివరంగా ప్రస్తావించి, ప్రస్తుతించి, తనొచ్చిన పనేమిటో వినయంగా విడమర్చి చెప్పి సవినయంగా శెలవు తీసుకుంటూ, శెలవు తీసుకోబోయేముందు "ఇది తీసుకోండి" అనకుండా, "ఇది వుంచండి" అంటూ, శ్రీనివాసమూర్తికి ఒక అందమైన కవరు అందించి వెళ్ళాడు.

శ్రీనివాసమూర్తి కామేశ్వర్రావ్ స్నేహపూర్వకంగా అందించిన చెయ్యి అందుకున్నాడు. కమ్మగా ఒకసారి చిరునవ్వు నవ్వాడు. కనుసన్నతోనే తన

అంగీకారాన్ని కామేశ్వర్రావ్‌కి తెలియబర్చాడు. కవరు మెల్లగా కోటు జేబులో పెట్టుకున్నాడు. గది బయటదాకా వచ్చి కామేశ్వర్రావ్‌ని సాగనంపాడు. తర్వాత మళ్ళీ తన గదిలోకొచ్చి మెల్లగా జేబులో కవరు తీసి, విప్పి చూశాడు. ఫెళఫెళలాడుతూ అందంగా కొత్తగా వున్న వందరూపాయల నోట్లు యాభై అంటే అక్షరాలా అయిదువేల రూపాయలు అందులో ఉన్నాయి. అవన్నీ జాగ్రత్తగా లెక్కబెట్టుకుని, తృప్తిగా నవ్వుకుని, డబ్బు జాగ్రత్త పరచి, బంగారపు సిగరెట్ కేస్‌లోంచి అతి ఖరీదైన సిగరెట్ బయటికి లాగి వెలిగించి ఒక దమ్ము లాగి, ఆ ఈవినింగ్ ఎలా ఎక్కడ ఎవరితో స్పెండ్ చెయ్యాలో అని ఆలోచిస్తూ, చాలా తియ్యటి ఆలోచనలు కొన్ని రాగా, మెల్లగా లేచి, అద్దాల తలుపుల కిటికీలోంచి బయటికి చూస్తూ నిలబడ్డ శ్రీనివాసమూర్తికి, ఆ వేళ ఎండ వెన్నెల్లా అనిపించింది.

యంపీరావుకీ, శ్రీనివాసమూర్తికే కాదు, శ్రీలతకి కూడా ఆ వేళ ఎండ వెన్నెల్లాగా వుంది.

శ్రీలత శ్రీకృష్ణా మాన్యుఫాక్చరింగ్ కంపెనీ సోల్ ప్రొప్రయిటర్ సోమేశ్వర్రావ్ గారి వోన్లీ డాటర్ అనగా ఏకైకపత్రిక. ఆ మాన్యుఫాక్చరింగ్ కంపెనీలో ఏం తయారుచేస్తారో ఎవరికీ కచ్చితంగా తెలీదు గాని, రూపాయి నోటు తయారుచేస్తున్నారేమో అని అందరూ అనుమానించేంతగా, సోమేశ్వర్రావ్‌గారి ఆదాయమూ, ఆస్తీ పెరిగిపోతున్నాయి.

సోమేశ్వర్రావ్‌గారి ఆస్తి లాగే ఆయన కూతురు శ్రీలత కూడా చాలా వేగంగా పెరిగింది. ఆ అమ్మాయికిప్పుడు పదిహేడేళ్ళే అయినా ఇరవయ్యేళ్ళదానిలా కనిపించేంతగా పెరిగింది. అందంగా, ఆకర్షణీయంగా కనిపించేట్టుగా పెరిగిన ఆమె శరీరంతో పాటు, కనిపించకుండా చాలా కోరికలు కూడా ఆ అమ్మాయి మనసులో పెరిగాయి. ఆ కోరికలన్నీ తీర్చుకోడానికి ఆమె చేసే అనేకానేకప్రయత్నాల్లో – బాయ్ ఫ్రెండ్స్‌తో సరదాగా సినిమాలకీ, షికార్లకీ తిరగటం కూడా ఒకటి.

ఆ రోజు మధ్యాహ్నం కాలేజీ ఎగొట్టి, కార్లో ఒంటరిగా థియేటర్ దగ్గరకి చేరి, తన బాయ్‌ఫ్రెండ్సందరిలోకీ అందగాడైన 'ఆనంద్' అనబడే ఆనందరావు కోసం అరగంట సేపు చాలా ఆత్రంగా, ఆదుర్దాగా ఎదురు చూసి, ఇంతలో అతను రాగా వచ్చిన వెంటనే అతని మీద బడి కౌగిలించుకున్నంత పని చేసి, చూడబోయే మ్యాట్నీ సినిమాలో తన అభిమాన హీరో గురించి అతనితో చర్చిస్తూ, థియేటర్‌కి

ఎదురుగా వున్న ఎయిర్ కండిషన్డ్ రెస్టారెంట్‌లో ఐస్ కోల్డ్ 'కోక్' సిప్ చేస్తూ 'బోబీ' గాగుల్స్‌లోంచి బయటికి చూస్తున్న శ్రీలతకి, ఆ వేళ ఎండ నిజంగా వెన్నెల్లా వుంది.

కాని – యంపీరావుకీ, శ్రీనివాసమూర్తికీ, శ్రీలతకీ వెన్నెల్లా వున్న ఎండ అందరికీ వెన్నెల్లా వుంటుందా? –

ఉండదు. ఎంత మాత్రమూ వుండదు!

ఎండ ఎండలాగే వుంటుంది.

ఆ వేళ కూడా ఎండ ఎండలాగే వుంది.

యంపీరావ్ పైనాపిల్ జ్యూస్ తాగుతూ కూర్చున్న షాపుకీ, శ్రీనివాసమూర్తి ఖరీదైన సిగరెట్టు కాలుస్తూ అందమైన ఆలోచనలు చేస్తున్న ఆఫీసుకీ, శ్రీలత తన అందమైన బోయ్ ఫ్రెండ్‌తో చూడబోయిన సినిమా థియేటర్‌కీ అతిసమీపంలోనే – ఒకానొక పేవ్‌మెంట్ మీద నీడ సరిగా ఇవ్వలేని ఒక చెట్టుకింద కూర్చున్న ఎర్రయ్య అనే ముసిలాడికీ –

పొద్దునెప్పుడో తాగిన గంజి నీళ్ళే ఆధారంగా, ఆవురావురావురంటూ ఉస్సురస్సురంటూ, చెమటలు కక్కుతూ, ఆ సెంటర్లోనే అటూ ఇటూ తిరుగుతూ, ఎంత తిరిగినా ఎవరూ కొనని వేరుసెనగపప్పులమ్ముతూ, లేక అమ్మటానికి ప్రయత్నిస్తూ వున్న అబ్బులు అనే పదకొండేళ్ళ కుర్రాడికీ, కాళ్ళకి చెప్పులైనా లేక పాదాల చర్మం కాలి, వూడి, రోడ్డుకంటుకుపోతోందా అన్నట్టు, కాలిపోతున్న రోడ్డు మీద కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ, గొంతు పగిలిపోయేలా అరుస్తూ, ఎంత తిరిగినా, ఎంత అరిచినా నాలుగు డబ్బులైనా సంపాదించలేకుండా వున్న సోడాల బండివాడు బసవయ్యకీ – ఇంకా ఆ ఎండలో – రిక్షాలు తొక్కేవాళ్ళకీ, రిక్షాలు తొక్కలేనివాళ్లకీ, రిక్షాలు ఎక్కలేని వాళ్ళకీ, కూలివాళ్ళకీ, ముష్టివాళ్ళకీ, ఇంకా ఎందరో దరిద్రులకీ, దౌర్భాగ్యులకీ, సామాన్యులకీ సగటు మనుష్యులకీ మాత్రం – ఎండ ఎండలాగే వుంది.

ఎండ నిప్పులు చెరుగుతోంది.

ఎండ భయంకరంగా వుంది. ఎండ దుర్భరంగా వుంది!

O

*(కేకలు – 4-4-1975)*